రాతి గుండె రేవంత్

బుల్డోజర్ రాజ్యం నడవదని రాహుల్ గాంధీ ప్రచారం చేస్తుంటే.. పేదల ఇండ్లపైకి రేవంత్‌రెడ్డి బుల్డోజర్లతో గూండా రాజ్యాన్ని అమలు చేస్తున్నడు.. కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తును తీసేసి బుల్డోజర్ గుర్తు పెట్టుకోండి -హరీశ్

మొదటిపేజీ తరువాయి...

ఆగ్రహం వ్యక్తంచేశారు. నగరంలోని మూసీ పరీవాహక ప్రాంతాలైన హైదర్‌షాకోట్, లంగర్‌హౌస్‌లోని హసీంనగర్ ప్రాంతాల్లో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, గంగుల కమలాకర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మహమూద్ అలీ, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, స్వామిగౌడ్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నాయకుల బృందం ఆదివారం పర్యటించింది. బాధితుల భుజం తట్టి భరోసానిస్తూ ముందుకు కదిలింది. కాయకష్టం చేసి కట్టుకున్న పేదల ఇండ్లను కూల్చకుండా రేవంత్ సర్కార్‌ను నిలువరిస్తామని బాధితులకు అభయమిచ్చింది. వేలాది మంది బాధితులు కలిసి తీసిన ర్యాలీలో పాల్గొని వారికి సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ మూసీ పేరిట జరుగుతున్న రియల్ ఎస్టేట్ దందాలు, అక్రమణల కోసం పేదల బతుకులను ఆగం చేయవద్దని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా.. కనీసం మ్యానిఫెస్టోలో లేని విషయం కోసం పేదల ఇండ్లను కూల్చడం ఎందుకని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీల్లో ఒక్కటీ పరిపూర్ణంగా అమలు కాలేదని, పేదల బతుకులు కూల్చే మూసీ సుందరీకరణకు లక్షన్నర కోట్లు ఎక్కడి నుంచి తెస్తారని నిలదీశారు. హైదరాబాద్‌ను పునర్నిర్మాణానికి కేసీఆర్ చేయూతనిస్తే.. రేవంత్‌రెడ్డి కూలగొట్టే కార్యక్రమాలను ముందటవేసుకున్నారని మండిపడ్డారు. ఇక్కడున్న నిర్మాణాలకు కాంగ్రెస్ హయాంలోనే పట్టాలు, పర్మిషన్లు ఇచ్చారని, ప్రజలు అన్ని రకాల ట్యాక్సులు కడుతున్నారని, కేసులు పెట్టేదుంటే

బాధితులెవరూ అధైర్యపడొద్దు. బీఆర్ఎస్ అండగా ఉంటది. మీ ఇండ్లపైకి వచ్చే బుల్డోజర్ల ముందు గులాబీ దండు నిలబడుతది. మీ ఇండ్లను కూల్చాలంటే మమ్మల్ని దాటుకొని రావాలి. -హరీశ్



కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్కటీ పరిపూర్ణంగా అమలు కాలే.. మహిళలకు ఇచ్చేందుకు రూ.2500 లేవుగాని, లక్షన్నర కోట్లతో పేదల బతుకులు కూల్చే మూసీ సుందరీకరణ ప్రాజెక్టును ఎలా చేపడుతరు? పెన్షన్ డబ్బులు ఎప్పుడిస్తావని నిలదీస్తే పైసల్లేవని చేతులెత్తేసిన సీఎం రేవంత్ రెడ్డి.. మూసీకి లక్షన్నర కోట్లు ఎక్కడి నుంచి తెస్తరు? -హరీశ్

హైదర్షాకోట్‌లో మూసీ బాధితులను పరామర్శించిన మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితారెడ్డి, మల్లారెడ్డి, గంగుల కమలాకర్‌తో తన గోడు వెళ్లబోసుకుంటున్న గర్భిణీ. చిత్రంలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి, కార్తీక్‌రెడ్డి తదితరులు

ఏ ప్రభుత్వమైతే అనుమతులిచ్చిందో దానిపై కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ బుల్డోజర్ రాజ్యం నడవదని ప్రచారం చేస్తుంటే.. రేవంత్‌రెడ్డి పేదల ఇండ్లపైకి బుల్డోజర్లు పంపుతూ గుండారాజ్యాన్ని అమలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తును తొలగించి బుల్డోజర్ గుర్తును పెట్టుకోవాలని ఎద్దేవా చేశారు. బాధితులెవరూ అధైర్యపడొద్దని, బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇండ్లపైకి వచ్చే బుల్డోజర్ల ముందు గులాబీ దండు ఉంటుందని స్పష్టం చేశారు. ఇండ్లను కూల్చాలంటే ముందు తమను దాటుకొని రావాలన్నారు.

సర్కార్‌పై మండిపడ్డ మాజీ మంత్రులు

అభివృద్ధి కోసం బీఆర్ఎస్‌ను విడిచి కాంగ్రెస్‌లో చేరిన ప్రకాశ్‌గౌడ్‌ను ఉద్దేశించి మాజీ మంత్రి గంగుల కమలాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఓట్లేసి గెలిపించిన బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలు ఇబ్బందుల్లో ఉంటే ఆయన ఎందుకు బయటకు రావడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీని విడిచి ప్రజల మనిషి కాకుండా పోయాడని విమర్శించారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ మూసీ బాధితులకు డబుల్ బెడ్రూం ఇస్తామంటున్న సీఎం రేవంత్ రెడ్డి, అంతకు ముందే 60వేల మందికి అలాట్ చేశారని, ఏ ఒక్క ప్రాజెక్టులోనూ ఇండ్లు ఖాళీ లేవని, 16వేల మంది బాధితులకు ఇస్తామన్న ఇండ్ల వివరాలు చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ మూసీ పేరిట కాంగ్రెస్ చేస్తున్న ఆరాచకాలతో పేదల ఇండ్లు కూలిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. రోమ్ నగరం తగలబడుతుంటే చక్రవర్తి ఫిడేల్ వాయించిన చందంగా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు.

మూసీ వెంట ఆందోళనలు, ఆక్రందనలు

నగరంలో విస్తరించి ఉన్న మూసీ పరీవాహక ప్రాంతాల కాలనీలు, బస్తీలన్నీ ఆందోళనలు, ఆక్రందనలతో నిండిపోయాయి. కాంగ్రెస్ అనాలోచిత చర్యలతో పేదలు రోడ్డున పడుతున్నారు. ఈ క్రమంలో మూసీ వెంట పలు కాలనీల ప్రజలు స్వచ్ఛందంగా బయటకు వచ్చి సీఎం రేవంత్‌రెడ్డి తీరును ఎండగడుతున్నారు. రెక్కలు ముక్కలు చేసుకుని కట్టుకున్న ఇండ్లను బుల్డోజర్లతో కూలగొడుతున్న కాంగ్రెస్ సర్కార్‌కు వ్యతిరేకంగా పెద్దఎత్తున ఆందోళన చేస్తున్నారు.

చేతులెత్తి మొక్కుతాం.. మమ్మల్ని కాపాడండి: లంగర్‌హౌస్ హషీమ్‌నగర్‌లో మూసీ బాధితులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

వంటావార్పుతో నిరసన

మన్సూరాబాద్, సెప్టెంబర్ 29: మూసీ పరీవాహక ప్రాంతమైన న్యూమారుతీనగర్ నార్త్ కాలనీలోని ప్రధాన కూడలి వద్దకు మహిళలు ఆదివారం పెద్దఎత్తున తరలివచ్చి రోడ్లపైనే వంటావార్పు నిర్వహించి ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు. తమ ఇండ్లను కూల్చాలని చూస్తే తగినరీతిలో సీఎం రేవంత్‌రెడ్డికి బుద్ధి చెప్తామంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పాటలు పాడారు. ఇండ్లను కూల్చాలని వచ్చే వారికి ఎదురొడ్డి నిలబడతామని ప్రతిజ్ఞ చేశారు. ప్రజాపాలన.. మార్పు అంటూ వచ్చి తమను నట్టేట ముంచాలని చూస్తున్న ముఖ్యమంత్రికి మహిళాలోకం తలచుకుంటే ఏం చేస్తుందో చూపుతామని హెచ్చరించారు. ఇక నుంచి రోడ్లపైనే వంటావార్పు నిర్వహిస్తూ తమపై దాడికి వచ్చే వారికి తగిన బుద్ధి చెప్తామన్నారు. చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా సహకారంతో నిర్వహించిన వంటావార్పు కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి హాజరై సంఘీభావం తెలిపారు. మూసీ అభివృద్ధి పేరిట ప్రజలను రోడ్డు పాలు చేస్తామంటే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇండ్లను కూల్చివేయొద్దని జరిగిన ఆందోళనలో మేము సైతం అంటూ పాల్గొన్న చిన్నారులు

న్యూమారుతినగర్ నార్త్ కాలనీలో వంట వార్పు కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, పక్కన ఇల్లు పోతుందనే బాధతో రోదిస్తున్న వృద్ధురాలు

కూల్చడమే ప్రజాపాలనా?

పేదల ఇండ్లను కూల్చడమే ప్రజాపాలనా?. పేదలంటే కాంగ్రెస్‌కు ఎందుకింత కక్ష? మా ఇండ్లు కూల్చి మమ్మల్ని రోడ్డు పాలు చేయడమే సీఎం లక్ష్యంగా కనిపిస్తున్నది. పేదల ఇండ్లను కూల్చడం కాదు.. కబ్జాలు చేసి కట్టిన బడాబాబుల ఇండ్లను కూల్చాలి. - జ్యోతి, ఫణిగిరి కాలనీ

కబ్జాకోరులం కాదు

పైసా పైసా కూడబెట్టి కట్టుకున్న ఇల్లు మాది. మేమేం కబ్జా కోరులం కాదు. 20 ఏండ్లుగా ఇక్కడే ఉంటున్నం. అన్ని అనుమతులు తీసుకొని కట్టుకున్న ఇంటిని కూలుస్తామంటే ఎలా ? మా ప్రాణాలు పణంగా పెట్టయినా ఇండ్లను కాపాడుకుంటం. పది రోజులుగా మమ్మల్ని తీవ్ర ఇబ్బందులు పెడుతున్నరు. ఏ రాత్రి ఎవరు వచ్చి ఇండ్లు కూలగొడుతరోనని భయపడుకుంట బతుకుతున్నం. - శైలజ, ఫణిగిరి కాలనీ

భూములు అమ్ముకొని కట్టుకున్నం

పిల్లల భవిష్యత్తు, ఉన్నత చదువుల కోసం గ్రామాల నుంచి వలస వచ్చి బతుకుతున్నం. ఇక్కడ అద్దెలు కట్టలేక ఊర్లో ఉన్న భూములను అమ్ముకొని ఇక్కడ స్థలాలు కొన్నం. ఆ సమయంలోనే అన్ని అనుమతులు తీసుకొని ఇల్లు కట్టుకున్నం. మేం కట్టుకుంటున్న ఇల్లు బఫర్‌జోన్‌లోనో, ఎఫ్‌టీఎల్‌లోనో ఉంటే ఎలా అనుమతులు ఇచ్చింద్రు? కష్టపడి కట్టుకున్న ఇంటికి ఇప్పుడు మార్కింగ్ చేసి ఖాళీ చేసి వెళ్లుమంటే ఎక్కడికిపోవాలి? - సత్యశ్రీ, ఫణిగిరి కాలనీ

డబుల్ బెడ్రూం వద్దు

లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి కట్టుకున్న ఇంటిని ఖాళీ చేసిపోతే డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇస్తామంటున్నరు. మీరిచ్చే డబుల్ బెడ్రూం ఇల్లు మాకు అవసరం లేదు. మా ఇంటికి ఖాళీ చేసే ప్రసక్తే లేదు. అవసరమైతే ప్రాణాలు తీసుకుంటం కానీ ఇల్లు ఖాళీ చేయం. బలవంతంగా ఖాళీ చేయించాలని చూస్తే ప్రాణాలు తీసుకుంటం. పేదలను చంపి మూసీని అభివృద్ధి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తున్నట్టున్నది. - శ్రీనివాస్, ఫణిగిరి కాలనీ

బామ్మర్దికి అమృతం.. పేదలకు విషమా?

- లీగల్ నోటీసులకు బెదిరిపోయేది లేదు
- న్యాయవ్యవస్థపై సంపూర్ణ విశ్వాసం ఉంది
- రాష్ట్రంలో ఆడబిడ్డల రోదన మంచిదికాదు
- రేవంత్.. నీ రాజీనామా తప్పదు!
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): బావమరిదికి అమృతం పంచి, పేదలకు విషం ఇస్తుంటే చూస్తూ ఊరుకునేది లేదని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేల్చిచెప్పారు. పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా కూడా ముఖ్యమంత్రి తన బావమరిది కంపెనీ (శోధ) రూ.1,137 కోట్లు టెండర్ కట్టబెట్టింది ముమ్మాటికీ నిజమేనని ఆయన ఎక్స్ వేదికగా స్పష్టంచేశారు. బావమరిదితో లీగల్ నోటీసు పంపితే ఇల్లీగల్ దందాల గురించి మాట్లాడటం బంద్ చేస్తా అనుకుంటున్నావా? అని ప్రశ్నించారు. సీఎం చట్టాన్ని ఉల్లంఘించారని, శోధ అనే కంపెనీ గత రెండేండ్లుగా రెండు కోట్లు మాత్రమే లాభం ఆర్జించిన చిన్న కంపెనీ అని కేటీఆర్ పేర్కొన్నారు. 'ఆదర్శ్ కుంభకోణంలో అశోక్ చవాన్‌లాగా నువ్వు దొరికావు.. రాజీనామా తప్పదు. ఢిల్లీలో ఉన్న నీ బీజేపీ దోస్తులు కూడా నిన్ను కాపాడడం కష్టమే' అని కేటీఆర్ హెచ్చరించారు. రూ.1.50 లక్షల కోట్ల సీఎం ధనదాహానికి లక్షల జీవితాలు బలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 'గూడు చెదిరి, గుండెపగులుతున్న ఆడబిడ్డల రోదనలు మంచిది కాదు మిస్టర్ చీప్ మినిస్టర్' అని ఆయన హెచ్చరించారు. ఆడబిడ్డకు కట్నంగా ఇచ్చిన ఇంటిని కూలుస్తరేమోనని ఆత్మహత్య చేసుకున్న తల్లి, భార్య కడుపుతో ఉంది కనికరించరా! అని ఒంటిపై పెట్రోల్ పోసుకున్న భర్త శాపనార్థాలు ఎవరికి తగులుతాయో ఆలోచించుకోవాలని పేర్కొన్నారు. 'మహానగర ప్రజలారా మీరు అధైర్యపడొద్దు, జరుగుతున్న విధ్వంసంతో తొందరపడి ప్రాణాలను బలి తీసుకోవద్దు, న్యాయ స్థానాలున్నాయి. మీకు మద్దతుగా బీఆర్ఎస్ ఉన్నది' అని కేటీఆర్ భరోసాను ఇచ్చారు.

నగరంలో నేడు, రేపు కేటీఆర్ పర్యటన

హైదరాబాద్ పరిధిలోని రాజేంద్రనగర్, అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో వరుసగా సోమ, మంగళవారాల్లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటించనున్నారు. '72 గంటల తర్వాత సాధారణస్థితికి వచ్చాను' అని ఆయన పేర్కొన్నారు.

భరోసా కోసం బీఆర్ఎస్ నీడకు..

తెలంగాణ భవన్‌కు కొనసాగుతున్న 'కూల్చివేతల' బాధితుల రాక

న్యాయం చేయాలని వేడుకోలు

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : మూసీ పరీవాహక ప్రాంతాల్లో సర్కారు కూల్చివేతల బాధితులు తెలంగాణ భవన్‌కు బారులు తీరుతున్నారు. కాంగ్రెస్ సర్కార్ తమ ఇండ్లను అకారణంగా కూల్చివేస్తూ తమను రోడ్డున పడేస్తున్నదని గోడు వెళ్లబోసుకుంటున్నారు. బాధితులకు అండగా ఉంటామని, న్యాయపోరాటం చేస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఇప్పటికే వెల్లడించారు. శనివారం నగరంలోని పలు కాలనీలు, బస్తీల నుంచి హైడ్రా బాధితులు పెద్దఎత్తున రాగా మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి అభయమిచ్చారు. కన్నీళ్లు పెట్టొద్దని ధైర్యం చెప్పారు. ఆదివారం హరీశ్‌రావు నేతృత్వంలో శాసనమండలిలో విపక్షనేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, గంగుల కమలాకర్, మహమూద్‌అలీ, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, మాణిక్‌రావు, కాలేరు వెంకటేశ్, పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సహా పలువురు పార్టీ నేతలు రాజేంద్రనగర్, సన్‌సిటీ, హైదర్‌షాకోట్, లంగర్‌హౌస్ హసీంనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు భరోసా కల్పించారు. మరోవైపు నగరంలోని పలు ప్రాంతాల నుంచి తెలంగాణ భవన్‌కు హైడ్రా బాధితులు తరలివచ్చారు. తమకు న్యాయం చేయాలని అర్థించారు. వచ్చిన వారి వివరాలను సిబ్బంది నమోదు చేసుకున్నారు. బాధితుల గోడు ఓపిగ్గా వింటున్నారు. బాధితులకు తగిన ఏర్పాట్లు చేయాలని కేటీఆర్ ఆదేశించటంతో తెలంగాణ భవన్ ఇన్‌చార్జి విస్తృత ఏర్పాట్లు చేశారు.

హైకోర్టు ఆదేశాలున్నా ఇండ్లు కూల్చింద్రు

- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో లేకున్నా పడగొట్టిండ్రు
- మీడియా సమావేశంలో బాధితుల ఆవేదన

మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న బాధితులు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 29 : ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో లేకున్నా హైడ్రా అన్యాయంగా తమ బతుకులను రోడ్డున పడేసిందని బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేటకు చెందిన బాధితులు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మీడియాతో మాట్లాడారు. కిష్టారెడ్డిపేటలోని సర్వే నంబరు 165, 166లో ప్లాట్ నంబర్ 90లో పొదులకూరి కల్యాణ్ అపార్ట్‌మెంట్‌ను నిర్మించగా, ప్లాట్ నంబర్ 92లో గణేశ్ కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన వెంకట్‌రెడ్డి పిల్లల వైద్యశాల నిర్మించాడని, ప్లాట్ నంబర్ 74లో ప్రధాన రహదారి పక్కనే 20 ఏండ్ల క్రితం స్థలం కొనుక్కొని కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించారని తెలిపారు. గత ఆదివారం హైడ్రా, తహసీల్దార్ పర్యవేక్షణలో ఆ మూడు భవనాలను కూల్చివేశారని, అప్పులు తెచ్చి కట్టుకున్న భవనాలను కండ్లముందే నేలమట్టం చేశారని కన్నీటిపర్యంతమయ్యారు. 1984లోనే లే అవుట్ అయ్యిందని, ఎల్ఆర్ఎస్ కూడా ఉన్నదని చెప్పారు. ఆర్నెళ్ల క్రితం తమ స్థలంలో ఉన్న గోడను తహసీల్దార్ కూల్చివేస్తే హైకోర్టును ఆశ్రయించామని తెలిపారు. ఈ వ్యవహారంలో రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకోవద్దని, యజమానుల ఇండ్లను కూల్చవద్దని కోర్టు ఆర్డర్ ఇచ్చిందని చెప్పారు. కొద్ది రోజులకే స్లాబ్ తొలగించడంతో కోర్టు ధిక్కరణ కేసు వేశామని, అప్పటి నుంచి అధికారులు కక్షగట్టారని కల్యాణ్, వెంకట్‌రెడ్డి, మధుసూదన్ వాపోయారు. అన్నిరకాల రుజువులు, సాక్ష్యాలను కోర్టులో సమర్పించగా, తమకు అనుకూలంగా తీర్పునిచ్చిందని తెలిపారు. కోర్టులో కేసు ఉండగా,గృహాలను కూల్చివేసి నిరాశ్రయులను చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారుల వ్యవహారంపై కోర్టుకు వెళితే హైడ్రా, తహసీల్దార్లకు మొట్టికాయలు వేస్తూ నోటీసులు జారీ చేసిందని, 30న హాజరు కావాలని ఆదేశించిందని తెలిపారు. కూల్చివేతలతో రూ. 5 కోట్ల నష్టం జరిగిందని, తమకు ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తంచేశారు.

ఓ అధికారికి రెండు కోట్ల ఇవ్వనందుకే!

మొదటి నుంచి ఓ అధికారి తమ నిర్మాణాలు ప్రభుత్వ స్థలంలో ఉన్నాయని, రూ.2 కోట్లు ఇస్తే పట్టించుకోమని చెప్పారని బాధితుడు వెంకట్‌రెడ్డి ఆరోపించారు. ఎలాంటి సర్వే, డీమార్కింగ్ చేయలేదని, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో కూడా తమ నిర్మాణాలు లేవని, అన్ని అనుమతులు ఉన్న పట్టా భూమి అని, డబ్బులు ఇవ్వనందుకే తమపై కక్షగట్టి కూల్చివేశారని మీడియాకు తెలిపారు. సదరు అధికారే హైడ్రాను తప్పుదోవపట్టించి భవనాలు కూల్చివేయించారని ఆరోపించారు.

అక్రమ నిర్మాణాలపై బుల్డోజర్లు వెళ్తే తప్పా?

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, సెప్టెంబర్ 29(నమస్తే తెలంగాణ): అక్రమ నిర్మాణాలను చూస్తూ ఊరుకోవాలా? బుల్డోజర్లు వెళ్తే తప్పా? అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సమర్థించుకున్నారు. సీఎల్పీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. హైడ్రాకు ఎవరైనా ఒక్కటేనని, అక్రమ నిర్మాణాలపై ఎవరినీ ఊపేక్షించేది లేదని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడికి కూడా నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు. మూసీ, హైడ్రా విషయంలో తమ ప్రభుత్వం చట్టబద్ధంగా, ప్రణాళికతో ముందుకెళ్తున్నట్టు చెప్పారు. హైడ్రా విషయంలో పేదలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని, పేదలు, మధ్యతరగతి వారి నివాసాల విషయంలో ప్రభుత్వం తొందరపడదని, అపార్ట్‌మెంట్ నిర్వాసితులకు ఎలా న్యాయం చేయాలన్న దానిపై ముఖ్యమంత్రి యోచిస్తున్నారని వివరించారు. ఎవరూ ఆందోళన చెందొద్దని, ఎవరికీ అన్యాయం జరగదని తెలిపారు. అడ్డగోలుగా అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు ఉంటాయని స్పష్టంచేశారు. మూసీ ప్రక్షాళన కోసమే మూసీ రివర్ ఫ్రంట్‌తో ముందుకెళ్తున్నట్టు తెలిపారు. మూసీ రివర్ బెడ్‌లోని అక్రమ నిర్మాణాలనే తొలగిస్తున్నట్టు తెలిపారు.

ఆస్తులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత

హైదరాబాద్ అంటేనే లేక్స్, రాక్స్, పార్క్స్: భట్టి

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన శాన్‌ఫ్రాన్సిస్కోలో తెలుగు కమ్యూనిటీ మీట్ అండ్ గ్రీట్ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత సైతం ప్రభుత్వానిదేనని చెప్పారు. పేదలను అడ్డంపెట్టి కొందరు బిల్డర్లు అక్రమ నిర్మాణాలను చేపట్టి, వ్యాపారం చేస్తున్నారని మండిపడ్డారు. 'హైదరాబాద్ అంటేనే రాక్స్, లేక్స్, పార్క్స్.. అని పేర్కొన్నారు. ఇండ్ల నిర్మాణం పేరిట ఆ రాళ్లు కనుమరుగైపోయాయని, చెరువులను కబ్జాచేసి ఇండ్లు కట్టుకున్నారని, పార్కులు లేకుండా పోయాయని వివరించారు. మూసీ నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తామని, డబుల్ బెడ్‌రూం ఇండ్లు, చదువులు, ఆరోగ్యానికి జాగ్రత్తలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఇంధనశాఖ కార్యదర్శి రోనాల్డ్‌రోస్, స్పెషల్ సెక్రటరీ కృష్ణభాస్కర్, సింగరేణి సీఎండీ ఎన్ బలరాం పాల్గొన్నారు.

తొందరపడి కూల్చొద్దు

టీపీసీసీ జనరల్ సెక్రటరీ అద్దంకి దయాకర్

హైదరాబాద్, సెప్టెంబర్ 29(నమస్తే తెలంగాణ): హైడ్రా అధికారులు తొందరపడి బడుగు, బలహీనవర్గాల ఇండ్లను కూల్చొద్దని టీపీసీసీ జనరల్ సెక్రటరీ అద్దంకి దయాకర్ కోరారు. ఇది ప్రభుత్వంపై వ్యతిరేకతను పెంచుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన హైడ్రా, మూసీ వివాదంపై ట్విట్టర్ వేదికగా వీడియోలను పోస్ట్ చేశారు. ఎలాంటి నోటీసులు లేకుండా అధికారులు.. దళితులు, బలహీన వర్గాల వద్దకు వెళ్లినప్పుడు తొందరపడి నిర్ణయం తీసుకోవద్దని సూచించారు. హక్కులున్న ఎవరైనా తమ ఆస్తులు పోగొట్టుకుంటే వాటిని చట్టపరంగా పొందే హక్కు ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం కూడా ఇష్టానుసారంగా కూల్చివేతలు చేయదని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను రక్షించేందుకే ప్రభుత్వం కూల్చివేతలు చేపడుతున్నదని తెలిపారు. మూసీ ప్రాజెక్టులో భాగంగా కేవలం మార్కింగ్ మాత్రమే చేస్తుంటే.. కూల్చివేస్తున్నారంటూ ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు.

హైడ్రా.. సంగారెడ్డి జోలికి రావొద్దు

మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి హెచ్చరిక

సంగారెడ్డి, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న హైడ్రా సంగారెడ్డి నియోజకవర్గం జోలికి రావొద్దని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే టీ జయప్రకాశ్‌రెడ్డి (జగ్గారెడ్డి) ఆదివారం ఓ ప్రకటనలో హెచ్చరికలు జారీ చేశారు. హైడ్రా పేరుతో ప్రజలను అనవసరమైన భయాందోళనకు గురిచేయొద్దని సూచించారు. కూల్చివేతల పేరిట అధికారులు తన నియోజకవర్గంలో అత్యుత్సాహం ప్రదర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైడ్రా ఔటర్ రింగ్‌రోడ్డు లోపల మాత్రమే చర్యలు చేపడుతుందని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. రింగ్‌రోడ్డు వెలుపలి వైపు హైడ్రా యాక్షన్ ఉండదని సీఎం చెప్పడం జరిగిందని పేర్కొన్నారు. సీఎం మాటలను పక్కన పెట్టి హైడ్రా అధికారులు అత్యుత్సాహంతో చర్యలను పూనుకోవద్దని అన్నారు. సంగారెడ్డి నియోజక వర్గంలో హైడ్రా పేరుతో కూల్చివేతలు ఉంటాయని ప్రచారం జరుగుతుందని, దీంతో ప్రజలు ఆందోళనలకు గురవుతున్నట్టు పేర్కొన్నారు. సీఎం చెప్పినట్టుగా ఔటర్ రింగ్ రోడ్డుకు బయట ఉన్న సంగారెడ్డిలో ఎలాంటి కూల్చివేతలు లేకుండా చూడాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సూచించారు. ఒకవేళ ఈ నియోజకవర్గంలో హైడ్రా ఏమైనా చర్యలు తీసుకోవాలనుకుంటే ముందుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు.